క్లుప్తంగా

బాల్య వివాహాలపై అవగాహన



కల్వకుర్తి: పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో సోమవారం కోనేరు స్వచ్ఛంద సంస్థ సభ్యులు విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. సురక్షిత బాల్యం -సురక్షిత భారతం పేరుతో ప్రత్యేక క్యాంపెయినింగ్ చేస్తున్నామని సంస్థ సభ్యులు తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేణుధర్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఆర్టీసీ ఉద్యోగులు



అచ్చంపేట రూరల్: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం హైదరాబాద్‌లో మండలానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్యలను వివరించారు. మంత్రిని కలిసిన వారిలో అశ్వత్థామ రెడ్డి, మోహన్‌లాల్, బీఎస్ రెడ్డి, వీసీఎస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నర్సరీల పరిశీలన

తాడూరు: మండల కేంద్రంతో పాటు గుంతకోడూరు ఇంద్రకల్ గ్రామాల్లోని నర్సరీలను ఎంపీడీఓ గంగమోహన్ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. కవర్లలో సారవంతమైన మట్టిని నింపే ప్రక్రియ, నీటిని అందించే విధానంపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. గడ్డి, పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. జూన్ నెల వరకు మొక్కలు సిద్ధం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సాయి క్లినిక్ సీజ్



తాడూరు: మండల కేంద్రంలోని సాయి క్లినిక్ ప్రథమ చికిత్సా కేంద్రాన్ని సోమవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటదాసు సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తుందని, తగిన అర్హతలు లేకుండా స్థాయికి మించి చికిత్సలు నిర్వహిస్తున్నారంటూ ఫిర్యాలు అందాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు వివరాలు సేకరించిన అనంతరం చికిత్స కేంద్రాన్ని సీజ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మొక్కులు చెల్లించుకున్న నాయకులు



కోడేరు: ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుకు మంత్రి పదవి రావడంతో మండల కేంద్రంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు పొడేల్ల సురేష్ ఆధ్వర్యంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు, మండల అధ్యక్షుడు శాంతయ్య, మేస్త్రీ కుర్మయ్య, సురేందర్‌రెడ్డి, చలపతిరావు, చామంతి రాజు, శరత్‌బాబు, మాజీ వార్డు సభ్యులు రాజు, అర్జునయ్య, రామకృష్ణ, నాగేషి, ఆనంద్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో సోమవారం కార్తీక మాసం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీపంలో ఉన్న ఉసిరి చెట్టుకు పలువురు దంపతులు దీపాలు వెలిగించారు. అదే విధంగా సాయినాథుడికి మంగళహారతిలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నదానం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా శివాలయంలో దీపారాధన నిర్వహించారు. మాజీ సర్పంచ్ కోట్ల సురేందర్ అన్నదానం చేశారు.

అన్నదానం

తెలకపల్లి: మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో సోమవారం మామిళ్లపల్లి పవన్, సాయిబాబు ఆధ్వర్యంలో 30 మంది హనుమాన్ మాలధారులకు అన్నదానం చేశారు. అంతకుముందు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రోడ్డు లేక అవస్థలు

- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- పట్టించుకోని అధికారులు



కార్వంగ-గౌరారం మట్టి రోడ్డు



బురదమయంగా కార్వంగ-గౌరారం గ్రామాల మట్టిరోడ్డు

తెలకపల్లి: మండలంలోని పలు గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. గత పాలకులు ఇచ్చిన హామీలు నీటిమీద రాతలుగా మిగిలాయని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు నిర్మిస్తామని, అంతర్గత రోడ్లు అభివృద్ధి చేస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. కాని ఏ గ్రామానికి కూడా బీటీ రోడ్లు నిర్మించిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపించారు. మండలంలో ఆయా గ్రామాలకు అంతర్గత రోడ్ల మరమ్మతు పనులు చేయక ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మట్టి రోడ్లు పూర్తిగా గుంతలమయంగా ఉండటంతో కాలినడకన మండల కేంద్రానికి వెళ్తున్నారు. మరికొన్ని గ్రామాలకు పూర్తిగా రాకపోకలే నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులే కాకుండా రైతులు పొలాలకు వెళ్లేందుకు తిప్పలు తప్పడం లేదు.

నెరవేరని నాయకుల హామీలు

గ్రామాలకు బీటీ, సీసీ రోడ్లు నిర్మిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిన క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. సంవత్సరాలు గడిచినా ఉన్న రోడ్లకు మరమ్మతు కూడా చేయలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

తప్పని తిప్పలు

మండలంలోని కార్వంగ నుంచి రామగిరి, కార్వంగ నుంచి గౌరారం, తెలకపల్లి నుంచి నక్కలబండ రోడ్డు, నెల్లికుదురు నుంచి నక్కలబండ రోడ్డు, రాకొండ నుంచి లక్నారం, కమ్మరెడ్డిపల్లి గ్రామాలకు, గౌరారం నుంచి మామిళ్లపల్లి, దాసర్లపల్లి గ్రామాలకు, చిన్నముద్దునూరు నుంచి జమిస్తాపూర్ గ్రామాల్లో మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి.

నిలిచిన రాకపోకలు

మండలంలోని కార్వంగకు కొన్నేళ్లుగా రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. గతంలో ఎడ్లబండ్లు రెండు గ్రామాలకు రాకపోకలు కొనసాగేవి. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పనికి ఆహారపథకంలో మట్టి రోడ్డుకు మరమ్మతు చేపట్టారు. కాని కొద్ది కాలంలోనే రోడ్లు ధ్వంసమయ్యాయి. గౌరారం నుంచి దాసర్లపల్లి, మామిళ్లపల్లికి రోడ్లు లేక తెలకపల్లి మండల కేంద్రం మీదుగా కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి దుస్థితి ఏర్పడింది. కార్వంగ నుంచి రామగిరికి, జమిస్తాపూర్ నుంచి చిన్నముద్దునూరు కనీసం మట్టి రోడ్డు గుంతలమయంగా మారాయి. ఇటీవల ఎన్నికల ముందు కార్వంగ నుంచి నందిపేట మీదుగా జమిస్తాపూర్‌కు బీటీ రోడ్డు మంజూరైనా తాత్కాలికంగా పనులు నిలిచిపోయాయి. తెలకపల్లి నుంచి తాళ్లపల్లికి వెళ్లే బీటీ రోడ్డు ఐదు సంవత్సరాల కిందట రెండు కిలోమీటర్ల పొడవునా నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో బీటీ రోడ్డు వేసి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రెండు దశాబ్దాలు గడిచినా..



దాదాపు 20 ఏళ్లుగా కార్వంగ, గౌరారం గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. రెండు దశాబ్దాలుగా రాకపోకలు నిలిచిపోయాయి. రెండు గ్రామాలకు వెళ్లాలంటే తెలకపల్లికి చేరుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దాదాపు 15 కిలోమీటర్లు ప్రయాణించక తప్పడం లేదు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటి వరకు కనీసం మట్టిరోడ్డుకు మరమ్మతు చేపట్టకపోవడంతో ముళ్ల కంపలు, కంప తారుచెట్లు రోడ్డు వెంట దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

-ఆనంద్, రైతు గౌరారం

ప్రతిపాదనలు పంపిస్తాం

మండలంలో పలు గ్రామాలకు అంతర్గత రోడ్ల సౌకర్యం లేదు. కానీ బీటీ రోడ్ల నిర్మాణాల కోసం ఎలాంటి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించలేదు. బీటీ రోడ్ల మంజూరుకు కృషి చేస్తాం. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటాం.

-మల్లారెడ్డి, పీఆర్ ఏఈ

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

కల్వకుర్తిరూరల్: మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా కల్వకుర్తి ప్రాంతానికి నీటిని అందించి రైతుల పంటలను కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతులను ఇబ్బందులకు గురి చేయడంపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కల్వకుర్తి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ మనోహరా చెన్నకేశవులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా కాలువలో నీటి విడుదల 15 రోజులుగా నిలిచిపోయి రైతులు అవస్థలు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. కేఎల్ఐ అధికారులు మూడు రోజులు మాత్రమే అయిందని సమాధానం చెప్పడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు.



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఎన్నికల సందర్భంలో అవసరం లేకున్నా నీటిని ఎందుకు వదిలారని ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇరిగేషన్ వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, జెడ్పీటీసీ భరత్‌ప్రసాద్, ఎంపీపీ మనోహరా, వైస్ ఎంపీపీ గోవర్ధన్, ఎంపీడీఓ ఆంజనేయులు, తహసీల్దార్ ఇబ్రహీం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు ఒత్తిడి చేస్తాం



కొల్లాపూర్ రూరల్: రాష్ట్రంలో కేసీఆర్ నిరంకుశ పాలన అంతమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే విధంగా ఒత్తిడి తెస్తామని దళిత దండు రాష్ట్ర అధ్యక్షుడు బచ్చలకూర బాల్‌రాజు అన్నారు. సోమవారం పట్టణంలోని కేఎల్ఐ అతిథి గృహంలో ఆయన దళిత దండు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో దళితుల భూములు కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా చిన్నబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొల్లాపూర్ మండల అధ్యక్షుడిగా నరసింహ, పెంట్లవెల్లి మండల అధ్యక్షుడిగా బిచ్చన్న ఎన్నికయ్యారు. సమావేశంలో కృపాకర్, మల్లేల వెంకటస్వామి, రామకృష్ణ ఉన్నారు.

కొల్లాపూర్: వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు డీకే మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో వర్గీకరణ విషయంలో వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామని చెప్పి బీజేపీ ప్రభుత్వం మాట తప్పిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీజేపీ తరహాలో కాకుండా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. దళితుల సంక్షేమానికి పాటు పడాలని కోరారు.

విద్యార్థుల ప్రతిభ

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు భానుప్రసాద్, గణేష్ రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చి మొదటి, రెండవ స్థానంలో నిలిచారు. కామారెడ్డి జిల్లా ఉప్పలవాయిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలలో భాగంగా సోమవారం నిర్వహించిన అండర్-19 విభాగంలో 200 మీటర్ల పరుగులో భానుప్రసాద్ మొదటి స్థానంలో, గణేష్ రెండవ స్థానంలో నిలిచారని పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 9 నుంచి 12 వరకు పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు బద్దులేశ్వర త్రిముఖ దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అష్టోత్తరం, రుద్రాభిషేకం, మహాలింగార్చన, భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. అమ్మవారికి షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు మారోజు ఉమాపతి ఆచార్యులు, శ్రీనివాసులు, రామన్‌గౌడ్, సైదమ్మ, రాధిక, శ్రీదేవీ, యాదమ్మ, వెంకటాచారీ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నిమతాలకు ప్రాధాన్యం ఇస్తాం

అచ్చంపేట రూరల్: అన్నిమతాలకు ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా రంగాపూర్ నిరంజన్‌షావలి దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని మారుతీనగర్ ఆంజనేయస్వామి, సాయిబాబా, కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేను ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అనంతరెడ్డి, రామనాథం, గౌరీశంకర్, రాజేందర్, రఘుపతిరెడ్డి, మాధవరెడ్డి, గిరివర్ధన్‌గౌడ్, గణేష, రఫీ, చంద్రశేఖర్, ఆర్టీసీ ఉద్యోగులు ఏజే రెడ్డి, జేఆర్ రెడ్డి, టీఆర్‌సీ రెడ్డి పాల్గొన్నారు.



రంగాపూర్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



వెల్దండ: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని బొల్లంపల్లి, బండోనిపల్లి గ్రామాల్లో నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నర్సరీలల్లో మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలన్నారు. సకాలంలో మట్టితో కవర్‌బ్యాగులను పూర్తి చేసి విత్తనాలను నాటించాలన్నారు. ప్రతి నర్సరీల్లో 10వేల మొక్కల పెంచాలన్నారు. గ్రామాల్లో డ్రెయినేజీలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, టీఏ రాజ్‌కుమార్, సత్యనారాయణ ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా



నాగర్‌కర్నూల్‌రూరల్: రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గం చూపాలని తెలంగాణ ప్రైవేట్, పబ్లిక్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పొదిల రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రవాణ రంగంపై 50 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. కార్మికుల సంక్షేమానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఆటో రంగాల యూనియన్స్ నాయకులు శివ, వేణుగోపాల్, రాఘవేంద్ర, పరమేష్, బాలస్వామి, కృష్ణ, కుర్మయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 11567 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు, కార్యదర్శి తుమ్మ మహేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పంచాయతీ అధికారికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 నెలల నుంచి గ్రామ పంచాయతీ వర్కర్లకు జీతాలు చెల్లించకుండా కార్మికులతో వెట్టి చేయించుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వం సమయానికి వేతనాలు చెల్లించలేదని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్య దోరణిని వీడాలన్నారు. కార్మికుల ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

సామూహిక వ్రతాలు



కొల్లాపూర్: పట్టణంలోని మాధవస్వామి దేవాలయంలో సోమవారం సామూహిక వ్రతాలు చేపట్టారు. కార్తీకమాసం ముగింపు సందర్భంగా ఆలయంలోని ఉసిరిచెట్టు వద్ద మహిళలు వ్రత పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంకాలం లక్ష దీపార్చన చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ విజయ్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలించారు. బాలపీరు, వెంకటస్వామిగౌడ్, రామకృష్ణగౌడ్ తదితరులున్నారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శివశంకర్ గౌడ్

కందనూలు: బిజినేపల్లి మండలం కారుకొండ గ్రామానికి చెందిన ఏబీవీపీ నాయకుడు కాట శివశంకర్ గౌడ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామకం అయ్యారు. ఢిల్లీలోని ఏబీవీపీ జాతీయ మహాసభలో పేరును ప్రకటించారని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి తపాలా ఉద్యోగుల సమ్మె

కల్వకుర్తి టౌన్: పలు డిమాండ్ల సాధన కోసం తపాలా ఉద్యోగులు మంగళవారం నుంచి సమ్మెలోకి వెళ్తునట్లు ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ వనపర్తి డివిజన్ వైస్ సెక్రెటరీ కృష్ణ, సంఘం నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిది గంటలు విధులు, పింఛన్, అడిషనల్ ఇంక్రిమెంట్, గ్రాట్యూటీ తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

బాలాజీసింగ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి

చారకొండ: తెలంగాణ ఉద్యమనేత ఠాగూర్ బాలాజీ సింగ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జూపల్లి వెంకటయ్య యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని జూపల్లిలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 12మంది ఎమ్మెల్యే గెలుపుకోసం కృషి చేశారని పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు ముజ్జుబాయి, కమాలోద్దిన్, శ్రీనివాస్ గౌడ్,దేవెందర్, భగవాన్, యువ నాయకులు సీరాజ్, ఖాజాలు ఉన్నారు.

బ్యాగుల అందజేత



దోమలపెంట: స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అమెరికా తెలుగు అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సోమవారం స్కూల్ బ్యాగులను అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని మధు, ప్రధాన కార్యదర్శి చల్ల జయంత్, కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని బ్యాగులు పంపిణీ చేశామన్నారు. తాగునీటి కోసం వాటర్ ఫిల్టర్ త్వరలో అందజేస్తామని తెలిపారు. హెచ్ఎం నాగయ్య, సర్పంచ్ శారద, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ విడుదల

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో జైహో 2వ జాతీయ ఉద్యమ వాల్ పోస్టర్‌ను ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజు నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 19వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన ఉన్న పల్లిపాడులో జాతీయ సమ్మేళనం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. సంఘం నాయకులు లక్ష్మేశ్వర్, అభి, పవన్, హరికృష్ణ, శ్రీకాంత్, శ్రీశైలంలు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు చేపట్టాలి

కొల్లాపూర్: రాష్ట్రంలోని వ్యవసాయ ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవికి ఎల్లూరు గ్రామ అభ్యుదయ సేవా సంస్థ అధ్యక్షుడు బండి వెంకట్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. సోమవారం ఆయన మల్లురవిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడి ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తే రాష్ట్రానికి ఆదాయం లభిస్తుందని వివరించారు. వచ్చిన ఆదాయంతో ఉచిత పథకాల అమలుకు ఖర్చు చేయాలని కోరారు.

ఎనిమిది కాళ్ల గొర్రెపిల్ల జననం



కోడేరు: మండలంలోని బావాయిపల్లిలో ఎనిమిది కాళ్ల గొర్రె పిల్ల జన్మించిన ఘటన సోమవారం చోటుచేసుకొంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గొల్ల నిరంజన్‌కు సంబంధించిన గొర్రె ఎనిమిది కాళ్ల గొర్రె పిల్లకు జన్మనిచ్చింది. కొద్ది సేపటికే మృతి చెందిందని కాపరి పేర్కొన్నాడు. ఈ విషయంపై పశువైద్యాధికారి డాక్టర్ భానుకిరణ్‌ను వివరణ కోరగా జన్యుపరమైన కారణాల వల్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటామని వివరించారు. వింత గొర్రెపిల్లను చూసేందుకు గ్రామస్తులు పోటీపడ్డారు.

ఎమ్మెల్యేకు సన్మానం

కల్వకుర్తి టౌన్: అన్ని మతాలకు ప్రాధాన్యం ఇస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీనగర్‌లో ఉన్న దర్గాలో ప్రార్థనలు చేశారు.

కల్వకుర్తి: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మండల అధికారులు సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ ఆంజనేయులు, ఎస్ఐ రమేష్, విద్యుత్ శాఖ ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ శ్రీనివాసులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్‌ను కాంగ్రెస్ నాయకులు కలిసి శాలువాలతో వారిని సత్కరించారు.

కల్వకుర్తిరూరల్: నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికై మొదటి సారి కల్వకుర్తికి వచ్చిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని జాజాల సర్పంచ్ రమాదేవి, మాజీ సర్పంచ్ రాకేష్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. పెన్సిల్‌తో గీసిన ఎమ్మెల్యే ముఖచిత్రాన్ని ఆయనకు అందజేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలని డీఎంకు వినతి



పెద్దకొత్తపల్లి: చంద్రబండతండాకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం అచ్చంపేట ఆర్టీసీ డీఎం చంద్రశేఖర్ గుప్తాకు వినతిపత్రం అందజేసినట్లు జెడ్పీటీసీ గౌరమ్మ, సర్పంచ్ రాంలాల్ తెలిపారు. గతంతో ఆర్టీసీ బస్సు పాత యాపట్ల నుంచి చంద్రబండ తండా, మారేడుదిన్నెకు బస్సు సౌకర్యం ఉండేదని పేర్కొన్నారు. ప్రస్తుతం బస్సు రాకపోకలు నిలిపివేయడంతో మూడు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని వారు వివరించారు. డీఎం స్పందిస్తూ త్వరలో బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చంద్రయ్య, ఆర్య నాయక్, గోపాల్ నాయక్, శ్రీను నాయక్ ఉన్నారు.

విద్యా ప్రణాళికలను అమలు చేయాలి



లింగాల: తరగతి గదిలో విద్యా ప్రణాళికలను అమలు చేయాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం బి శేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం తెలుగు బోధకుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. లింగాల, బల్మూర్, ఉప్పునుంతల మండలాలకు చెందిన తెలుగు బోధకులు హాజరయ్యారు. విద్యార్థుల ప్రగతి, పీరియడ్ ప్రణాళికలు, ప్రశ్నాపత్రాల తయారీ, ప్రదర్శన, చర్చ తదితర అంశాలపై చర్చించారు.

ఉప్పునుంతల: విద్యా బోధనలో పాఠ్య ప్రణాళిక కీలకమని కాంప్లెక్స్ హెచ్‌ఎం జె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉప్పునుంతల, బల్మూరు, లింగాల మండలాలకు చెందిన హిందీ ఉపాధ్యాయులకు నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నెలవారి పరీక్షల ఆధారంగా విద్యార్థుల ప్రగతిని తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషనల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఉన్నతి లక్ష్య కార్యక్రమాలపై ఉపాధ్యాయుడు కమలేకర్ నాగేశ్వర్‌రావు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు చంద్రు, తదితరులు పాల్గొన్నారు.